నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
నిజామాబాద్-కామారెడ్డి
ఆదివారం | నవంబర్ 03, 2024 | www.navatelangana.com

ఆలయ భూములు కాపాడాలి

- మంత్రి కొండా సురేఖకు ఎమ్మెల్యే వినతి



మంత్రికి స్వీట్‌బాక్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-మద్నూర్/పిట్లం

జుక్కల్ నియోజకవర్గంలోని అన్యాక్రాంతం అయిన దేవాలయ భూములను ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకొని దేవాలయాలకు అప్పగించాలని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావు కోరారు. దేవాదాయ శాఖ అటవీ శాఖ మంత్రి కొండా సురేఖను హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దీపావళి శుభాకాంక్షలు తెలియజేసి సమస్యలు విన్నవించారు. భూములలో పామాయిల్ మొక్కల పెంపకాన్ని చేపట్టి దేవాలయాలకు ఆదాయాన్ని సమకూర్చే విధంగా చర్యలు చేపట్టాలని మంత్రికి విజ్ఞప్తి చేసినట్టు తెలిపారు.

భగీరథ ట్యాంక్ పరిశుభ్రం

- నవతెలంగాణ కథనానికి స్పందన



ట్యాంక్‌ను శుభ్రం చేస్తున్న సిబ్బంది

నవతెలంగాణ-నిజాంసాగర్

మండలంలోని మల్లూరు తండా గ్రామంలో అపరిశుభ్రం.. భగీరథ ట్యాంక్ అనే శీర్షికతో నవతెలంగాణలో వెలువడిన కథనానికి ఆర్ డబ్ల్యూస్ ఏఈ సుమలత స్పందించారు. శనివారం హెల్పర్‌ని గ్రామంలోకి పంపించి వాటర్ ట్యాంకును శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడతామని తెలిపారు.

పనిభారం తగ్గించి ఆశాలపై వేధింపులు అరికట్టండి

- సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశాల వినతి
- కులగణ సర్వే నుంచి ఆశా వర్కర్లకు మినహాయింపు ఇస్తున్నట్టు డీఎంఅండ్‌హెచ్‌వో హామీ
- ఇచ్చిన హామీల అమలుకు 4 చలో కలెక్టరేట్ జయప్రదం చేయండి : నూర్జహాన్ పిలుపు



డీఎంఅండ్‌హెచ్‌వోకు వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఆశా వర్కర్లకు పనివారం తగ్గించాలని అధికారుల వేధింపులను ఆపాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. అదే విధంగా పల్స్ పోలియో, లెప్రెసి సర్వే, కంటి వెలుగు టీబి ట్రైనింగ్, పెండింగ్ డబ్బులు వెంటనే ఇవ్వాలని కోరారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆశా వర్కర్ల విస్తృత సమావేశం శనివారం నిర్వహించారు. అనంతరం డిఎంహెచ్‌కు కులగణన సర్వే ఆశ వర్కర్ల చేయబోమని ఈ సర్వే నుంచి తమను మినహాయించాలని వినతిపత్రం అందజేశారు. ఇందుకు డిఎంహెచ్‌ఓ స్పందిస్తూ ఆశ వర్కర్లకు ఈ సమగ్ర సర్వే నుండి (కులగన) సర్వేల నుండి మినయిస్తున్నట్టు తెలిపారు. వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని నూర్జహాన్ అన్నారు.

అనంతరం మాట్లాడుతూ ఆశ వర్కర్లకు ఫిక్స్ వేతనం అమలు చేయాలని ఉద్యోగ భద్రత కల్పించాలని వారసత్వాన్ని కొనసాగించాలని, ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల ఆరోగ్యం పట్ల ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలని విధి నిర్వహణలో ఆశ వర్కర్లు మరణిస్తే వాళ్లకు ఎక్స్ గ్రేషియా 10 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

అదే విధంగా గత ప్రభుత్వ హయాంలో 15 రోజుల సమ్మె నేపథ్యంలో ఆశాలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీలను ఫిబ్రవరి 9న ఆరోగ్యశాఖ కమిషనర్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని చేయాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పారితోషికాలను 18,000 ఫిక్స్ వేతనంగా నిర్ణయించాలని కోరారు. ఆశా వర్కర్ల వేతనాలు ప్రతినెల ఐదో తారీకు లోపు వారి అకౌంట్లో జమ చేయాలని కోరారు. ఆశా వర్కర్లకు ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని ఇస్తున్న పారితోషికంలో సగం పెన్షన్ రూపంలో ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆమె డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారానికై నవంబర్ 4న జరిగే ధర్నాని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశ యూనియన్ జిల్లా నాయకులు సుకన్య, బాలమణి, రేణుక శోభ, సిహెచ్ నర్సు, రాధా, లలిత, రేవతి, చందన, రాణి, సుజనా, సాహిర, వహీదా తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు ధాన్యం తూకం షురూ

- రైస్‌మిల్లుల కేటాయింపుతో తూకం ప్రారంభం
- కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన ఇరు జిల్లాల కలెక్టర్‌లు
- లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం సేకరణ సాఫీగా సాగేలా కృషి చేయాలని సూచన





రైస్‌మిల్లుకు తరలుతున్న లారీకి కొబ్బరికాయ కొడుతున్న సిబ్బంది.. ప్రారంభిస్తున్న కలెక్టర్.. రామారెడ్డి : బస్తా తూకం పరిశీలిస్తున్న కలెక్టర్

నవతెలంగాణ-డిచ్‌పల్లి/ధర్పల్లి/రామారెడ్డి

ధాన్యం సేకరణ ఎట్టకేలకు శనివారం ప్రారంభించారు. కోతలు పూర్తయి ఆరబెట్టి 20 నుంచి 30 రోజులవరకు అవుతున్నా.. రైస్‌మిల్లులను ప్రభుత్వం కేటాయించకపోవడంతో తూకం ప్రారంభించకపోవడం విధితమే. ఈ నేపథ్యంలో కురిసిన వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. కాగా రైస్‌మిల్లులు ధాన్యానికి బ్యాంక్ పూచీకత్తు ఇవ్వాలని ప్రభుత్వం షరతు విధించిన విషయం విధితమే. కాగా ఎట్టకేలకు రైస్‌మిల్లులను కేటాయించ డంతో కొనుగోలు కేంద్రాల్లో తూకం ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాలను ఇరు జిల్లాల్లో పలు మండలాల్లో కలెక్టర్‌లు పరిశీలించారు.

ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి స్థాయి లక్ష్యానికి అనుగుణంగా సాఫీగా సాగేలా కృషి చేయాలని, ఖరీఫ్ సీజన్ కు సంబంధించి ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. ఇందల్‌వాయి మండలంలోని ఇందల్‌వాయి గ్రామంలో, ఎల్లారెడ్డిపల్లితో పాటు ధర్పల్లి మండల కేంద్రంలో సహకార సంఘాల ఆధ్వర్యంలో నెలకొల్పిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ శనివారం అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. రైతుల సౌకర్యార్థం కేంద్రాలలో అందుబాటులో ఉంచిన సదుపాయాలను పరిశీలించారు. కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చిన రైతులను పలకరించి, కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అని ఆరా తీశారు. ధాన్యం విక్రయించిన రైతులకు త్వరితగతిన బిల్లుల చెల్లింపుల కోసం ట్యాబ్ లో వెంటదివెంట వివరాలు నమోదు చేయాలని సూచించారు. కొత్తగా ట్యాబ్ లు కేటాయించబడిన కేంద్రాల నిర్వాహకులు తక్షణమే డివైస్ మ్యాపింగ్ చేసుకోవాలని అన్నారు. ఎలాంటి గందరగోళం, పొరపాట్లకు తావులేకుండా ధాన్యం సేకరణ ప్రక్రియను సజావుగా జరిగేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని, ఎక్కడైనా లోటుపాట్లు ఉంటే సరిచేసుకోవాలని సూచించారు.

టార్పాలిన్‌లు అందుబాటులో ఉంచాలి

అకాల వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి స్థాయి లక్ష్యానికి అనుగుణంగా సాఫీగా సాగేలా కృషి చేయాలని అన్నారు. రైతులు ధాన్యం తెచ్చిన వెంటనే తూకం వేయించి, లారీలలో లోడ్ చేసి నిర్దేశిత రైస్ మిల్లులకు పంపించాలని, కొనుగోలు కేంద్రాలతో పాటు మిల్లుల వద్ద ధాన్యం లోడింగ్, అన్ లోడింగ్ వెంటదివెంట జరిగేలా పర్యవేక్షణ జరపాలన్నారు. అన్ని కేంద్రాలకు సరిపడా గన్నీ బ్యాగులు సమ కూర్చాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్, డీఎస్ఓ అరవింద్ రెడ్డి, సివిల్ సప్లైస్ డీ.ఎం అంబదాస్ రాజేశ్వర్, డీసీఓ శ్రీనివాస్, సొసైటి చైర్మన్ చింతల పల్లి గోవర్ధన్ రెడ్డి, సిఈఓ ఉప్పల్ వాయి రతన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోత్కురి నవీన్ గౌడ్, తదితరులు ఉన్నారు.

రామారెడ్డి : వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తూకం పక్కాగా వేయాలని, ధాన్యంలో చెత్త లేకుండా ప్యాడీ క్లీన్ చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. శనివారం రామారెడ్డి మండలం పోసాని పేట్ గ్రామంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ధాన్యంను శుభ్ర పరచాలని(ప్యాడీ క్లీన్) మానిటరింగ్ అధికారిని ఆదేశించారు. అలాగే 40 కిలోల 600 గ్రాముల ధాన్యం బస్తాలో నింపి పక్కాగా తూకం వేయాలని అన్నారు. కొనుగోలు కేంద్రంలో రైతులకు అన్ని ఏర్పాట్లు చేయాలని అన్నారు. వర్షాల వలన ధాన్యం తడిసి పోకుండా కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్ సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి రాం మోహన్, మానిటరింగ్ అధికారి యు. సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

- ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్



చికిత్సపొందుతున్న బాలికతో మాట్లాడుతున్న కమిషనర్ డా.అజయ్‌కుమార్

నవతెలంగాణ-దోమకొండ

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ వైద్యులను, సిబ్బందిని సూచించారు. దోమకొండ మండల కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రిని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులు సమయపాలన పాటించుతూ, ఎల్లప్పుడూ రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వైద్యం అందించాలని సూచించారు. ఆసుపత్రిలోని ఇన్ పేషేంట్ విభాగంలో వైద్యం ఎలా అందిస్తున్నారో రోగులకు వివరాలు అడిగారు. అధికారుల ఆదేశాల మేరకు దోమకొండ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించినట్టు తెలిపారు. మౌలిక వసతులు సౌకర్యాలు బాగున్నాయని , సిబ్బందికి తగు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి విజయలక్ష్మి, వైద్యులు వైద్వవి , శ్రీవాణి , దివ్య కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సీతారాం మధు ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కందకుర్తివద్ద చెక్‌పోస్ట్.. ముమ్మర తనిఖీలు



కార్లలో తనిఖీ చేస్తున్న పోలీసులు

నవతెలంగాణ-రెంజల్

రెంజల్ మండలం మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల మధ్యనున్న కందకుర్తి వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేసి ముమ్మర తనిఖీలు చేపట్టారు. మహారాష్ట్రలో ఎన్నికలు ఉండటంతో పాటు, మహారాష్ట్ర నుంచి తెలంగాణలోకి ధాన్యం రాకుండా ముందు జాగ్రత్తగా, పోలీస్ బలగాలు, రెవెన్యూ అధికారులు, ఫారెస్ట్ అధికారులతో చెక్‌పోస్ట్‌ను ఏర్పాటు చేసి ప్రతి వాహనాన్ని తనిఖీలు చేపడుతున్నారు. కందకుర్తి చెక్‌పోస్ట్ వద్ద ప్రతి వాహనాన్ని తనిఖీలు చేశారు. ఎన్నికలు, ధాన్యం సీజన్ పూర్తయ్యే వరకు ఈ చెక్‌పోస్ట్ కొనసాగనున్నట్టు తెలిపారు.

పోసానిపేటలో రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని పోసానిపేట జిల్లా పరిషత్ పాఠశాలలో నేటి నుంచి 5వ తేదీ వరకు అండర్ 14 రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు నిర్వహించనున్నట్టు ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర స్థాయిలో వివిధ జిల్లాల నుంచి క్రీడాకారులు రానున్నట్టుతెలిపారు. అందుకుతగ్గట్టు ఏర్పాట్లు చేపట్టినట్టు తెలిపారు.

తడిచిన ధాన్యమూ కొనాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వెంకట్‌గౌడ్ డిమాండ్
- కొనుగోలు కేంద్రాల్లో తడిచిన ధాన్యం పరిశీలన



కొనుగోలు కేంద్రంలో ధాన్యం పరిశీలిస్తున్న సీపీఐ(ఎం) నాయకులు

నవతెలంగాణ-లింగంపేట్

ప్రభుత్వం వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకట్ గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం లింగంపేట్ మండల కేంద్రంలో వరి కొనుగోలు కేంద్రం సందర్శించారు. అనంతరం వెంకట్‌గౌడ్ మాట్లాడుతూ వరి కొనుగోలు కేంద్రం గతంలో దసరా కంటే ముందే ప్రారంభించే వాళ్లని ఇప్పటికి రైతులు వరి కోసి 15 రోజులు అవుతుందని 15 రోజులుగా ఆరబెడుతున్నారని కానీ ఇప్పటికీ కొనుగోలు కేంద్రం ప్రారంభించలేదని వెంటనే ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఇక్కడ రైతులు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి షరతులు లేకుండా సాకులు లేకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

వరి కొనుగోలు కేంద్రాల వద్ద పట్టాలు లేక రైతులు కిరాయి తీసుకుని సుమారుగా ఒక ఎకరా ఉన్న రైతు నెల రోజులకు 2000 రూపాయల వరకు ఖర్చు అవుతుందని ఒకవైపు గిట్టుబాటు ధరలు లేక ఇబ్బంది పడుతుంటే మరోవైపు కొనుగోలు కేంద్రం వద్ద టాపర్ల సంబంధించిన ఖర్చు రైతుల మీద భారం పడుతుందని ఆయన అన్నారు. కావున వెంటనే సొసైటీ సిబ్బంది రైతులకు టార్పలిన్ కవర్లు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లింగంపేట్ కొనుగోలు కేంద్రం వద్ద కనీసం రైతులు ఆరవసుకోవడానికి స్థలం కూడా లేదని ప్రైవేటు స్థలాల వద్ద ధాన్యం పోస్తే ప్రైవేట్ యాజమాన్యం వద్దని బెదిరిస్తున్నారని సొసైటీ కొనుగోలు కేంద్రం స్థలాన్ని కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు భాస్కర్ సావిత్రి రమేష్ పాల్గొన్నారు.

వేతనాలు సకాలంలో ఇవ్వట్లే

- భిక్కనూరులో ఎంఎస్‌ఎన్ కంపెనీ ఎదుట కార్మికుల భారీ ధర్నా

నవతెలంగాణ-భిక్కనూర్

వేతనాలు సకాలంలో ఇవ్వట్లేదని భిక్కనూరు పట్టణ శివారులో ఉన్నా ఎంఎస్‌ఎన్ ఫార్మా కంపెనీ ఎదుట శనివారం మధ్యాహ్నం డైలీ వైస్ లేబర్‌లు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. కంపెనీ గేటు వద్ద సూమారు 2 గంటకు పైగా బైఠాయించిన కార్మికులు యాజమాన్యానికి, కాంట్రా క్టర్లకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం కార్మి కులు మాట్లాడుతూ తమకు హెచ్‌ఆర్ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాడని, సమయపాలన లేకుండా ఇష్టం వచ్చినట్లుగా తమతో పనిచేస్తు న్నారనివాపోయారు. ఈఎస్ఐ, పీఎఫ్ కట్ చేయడం లేదని, అడిగినా సరైన సమాధానం చెప్పకపోగా ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఇష్టం వచ్చినట్లు మాట్లా డుతు న్నాడని తెలిపారు. తమకు సరిగా వేతనాలు సైతం ఇవ్వడం లేదని, ఓటీ చేసిన వారికి వేతనం ఇవ్వడం లేదని, ఓటి చేసిన వారికి భోజనం సైతం పట్టడం లేదని ఆరోపించారు. యాజమాన్యం వచ్చి తమకు హామీ ఇవ్వాలని, తమకు న్యాయం జరిగేంతవరకు ఎక్కడినుంచి జరిగేది లేదని తేల్చి కంపెనీ ముందు బీష్మించుకొని కూర్చున్నారు. మూడు గంటల పాటు ధర్నా చేపట్టారు. హెచ్‌ఆర్ సుబ్బారావ్, మేనేజర్ వర్మ స్పందించి కార్మికులతో మాట్లాడి నాలుగు రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో కార్మికులు శాంతించారు.



కంపెనీ ఎదుట ధర్నా చేపట్టిన కార్మికులు

గ్రామాలను కమ్మేసిన పొగమంచు

నవతెలంగాణ-మోర్తాడ్/ఆర్మూర్/రెంజల్/కమ్మర్‌పల్లి

శనివారం తెల్లవారుజామున పలు గ్రామాల్లో పొగ మంచు కమ్మేసింది. 8.40 గంటల వరకు సైతం పొగమంచు ఆవరించుకుంది. దీంతో రోడ్లమీద వాహనదారులకు ముందు వెళ్తున్న వారు కనిపించకుండా పోయారు. ఎదురెదురుగా వస్తున్న వాహనాలు కనిపించకుండా భారీ స్థాయిలో పొగ మంచు కమ్మేసింది. లైట్లు వేసుకొని నడపాల్సిన పరిస్థితి నెలకొంది.

దీనికి తోడు ఆరబెట్టిన ధాన్యం పూర్తిగా పొగ మంచు ద్వారా వడ్లు పూర్తిగా తడిగా అయ్యాయి. గత రెండు మూడు రోజుల క్రితం ఎలాంటి పొగ మంచు లేని గ్రామాలు దీపావళి మరుసటిరోజే ఇలా భారీ స్థాయిలో పొగ మంచు రావడం గమనార్హం. ఆర్మూర్ పట్టణాన్ని సైతం పొగమంచు కమ్మేసింది. ఉదయం లేచి చూసేసరికి దట్టమైన పొగమంచు కనిపించడంతో ఆహ్లాదం పొందారు. అయితే రోడ్లమీద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించని పరిస్థితి ఏర్పడింది.



ఆర్మూర్ పట్టణంలో..



మోర్తాడ్‌లో ధాన్యంపై



కమ్మర్‌పల్లిలో..

భూగర్భ జలాన్ని పరిరక్షించాలి

- భూగర్భజలశాఖ ఉపసంచాలకులు శ్రీనివాస్‌బాబు
- ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సూచన



పోస్టర్‌లు ఆవిష్కరిస్తున్న అధికారులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

నీటి వృధాను అరికట్టాలని, అదే విదంగా భూగర్బ జలాన్ని పరిరక్షించాలని భూగర్బ జల శాఖ ఉపసంచాలకులు శ్రీనివాస్ బాబు సూచించారు. నీటి ప్రాముఖ్యత విద్యార్థుల్లో కల్పించాల్సిన బాధ్యత మనందరి పైన ఉందని వివిధ పద్ధతుల ద్వారా భూగర్బ జలాలు పెంచాలని నీటి జాగ్రత్తలు పాటించాలని సూచించారు. జక్రాన్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భూగర్బ జల శాఖ వారి ఆధ్వర్యంలో విజన్ సంస్థ వారి సహకారంతో భూగర్బ జల పరిరక్షణపై శనివారం అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. అనంతరం విజన్ సంస్థ డైరెక్టర్ కైలాష్ మాట్లాడుతూ ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని, వర్షం ద్వారా వచ్చే నీటిని ఇంకుడుగుంతల్లోకి ఇంకింపజేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు డ్రాయింగ్ పోటీలు నిర్వహించి ప్రతిభ చాటిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హైడ్రాలజిస్ట్ హరి, వెంకటేశ్వర్లు, జూనియర్ అసిస్టెంట్ సాయిలు, గౌరవ అతిధులుగా మండల విద్యాధికారి శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు లింగన్న, ఉపాధి హామీ ఎపిఓ రవి, ఏఈ మోహన్ రెడ్డి, గ్రామపంచాయతీ సెక్రటరీ గంగాధర్, అమ్మ బడి ఆదర్శ కమిటీ లతా, ఉపాధ్యాయ బృందం, విజన్ సంస్థ సిబ్బంది శరత్ కుమార్, రాజు, గగన్ హారిక, యాదగిరి పాల్గొన్నారు.

ఎన్యుమరేటర్‌లను నియమించుకోవాలి

కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

నవతెలంగాణ-కామారెడ్డి

ఇంటింటి సర్వే కోసం అవసరమైన ఎన్యుమరేటర్‌లను నియమించుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎంపీడీఓ లు, మున్సిపల్ కమిషనర్ లు, ఎంపీఓ లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ నెల 6 నుండి ప్రారంభం కానున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే లో భాగంగా అవసరమైన ఎన్యుమరేటర్ లుగా ప్రైమరీ పాఠశాలల ఉపాధ్యాయులను నియమించుకోవచ్చని తెలిపారు. ఎన్యుమరేటర్ లకు అపాయింట్మెంట్ ఉత్తర్వులు జారీ చేయనున్నట్టు తెలిపారు. ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని సూచించారు. ఎన్యుమరేటర్ లకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రొజెక్టర్ ఏర్పాటుచేసి నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, సీపీఓ రాజారాం, జడ్పీ సిఈఓ చందర్, జిల్లా విద్యా శాఖాధికారి రాజు, ఎంపీడీఓ లు, మున్సిపల్ కమిషనర్ లు, ఎంపీఓ లు, తదితరులు పాల్గొన్నారు.

లబ్దిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



నవతెలంగాణ-బోధన్

సాలూర మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్దిదారులకు సాలూర మండల తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ శశిభూషణ్ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆపద కాలంలో మంజూరు చేసిన సీఎం రిలీఫ్ ఫండ్ ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మెన్ చీల శంకర్, సొసైటీ చైర్మన్ జనార్ధన్, హూన్సా సొసైటీ చైర్మన్ మందర్న రవి, వెంకటేశ్వర్ రెడ్డి, కేజీ గంగారాం, సొక్కం రవి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని ఆరబెట్టి, జల్లిపట్టి విక్రయించాలి

- వ్యవసాయ అధికారి శ్రీనివాస్

నవతెలంగాణ-రామారెడ్డి

రైతులు వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలో ఆరబెట్టి, జల్లిపట్టి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకు విక్రయించి రైతులు లబ్ధి పొందాలని అన్నారం క్లస్టర్ వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రైతులకు సూచించారు. శనివారం మండలం లోని మద్దికుంట ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో వరి ధాన్యాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో కొనుగోలు కేంద్రం ఇంచార్జ్ కరుణాకర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



ధాన్యాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

ఇంటింటి కుటుంబ సర్వేకు అన్ని విధాలుగా సన్నద్ధం

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్య, ఉపాధి, కుల వివరాల సేకరణకై ఈ నెల 06 నుంచి చేపట్టనున్న ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణ కోసం అధికారులను, క్షేత్రస్థాయి సిబ్బందిని అన్ని విధాలుగా సన్నద్ధం చేశామని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. ఇంటింటి సర్వే ఏర్పాట్లపై శనివారం రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా జిల్లాల కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. నిర్ణీత కాల వ్యవధి లోపు ఇళ్ల జాబితా (హౌజ్ లిస్టింగ్) రూపకల్పన ప్రక్రియను పూర్తి చేసి ఎన్యుమరేషన్ బ్లాక్‌లను పక్కాగా గుర్తించాలన్నారు. తదనుగుణంగా పూర్తిస్థాయిలో ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించుకోవాలని సూచించారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులను సర్వేలో భాగస్వాములు చేయాలని, ఏకకాలంలో సర్వే, డేటా ఎంట్రీ సమాంతరంగా జరిగేలా చొరవ చూపాలన్నారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ, ఏ ఒక్క నివాస గృహం సైతం తప్పిపోకుండా పకడ్బందీగా సర్వే నిర్వహించేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని అన్నారు. ప్రైమరీ పాఠశాలల ఉపాధ్యాయులు మధ్యాహ్నం ఒంటి గంట అనంతరం సర్వే నిర్వహించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. సర్వే సందర్భంగా సేకరించిన ఆయా కుటుంబాల స్థితిగతులకు సంబంధించిన వివరాలను వెంటదివెంట ఆన్లైన్‌లో నిక్షిప్తం చేసేలా సరిపడా సంఖ్యలో డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించడం జరిగిందన్నారు. ఎన్యుమరేటర్లు, పర్యవేక్షకులు మాస్టర్ ట్రైనర్లచే శిక్షణ ఇప్పించామని, జిల్లాలోని అన్ని నివాస ప్రాంతాల్లో పక్కాగా సర్వే నిర్వహించేలా సన్నద్ధం చేశామని కలెక్టర్ తెలిపారు. వీ.సీ అనంతరం కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సంబంధిత అధికారులతో సమావేశమై ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణపై కీలక సూచనలు చేశారు. ఎలాంటి తప్పిదాలు, గందరగోళానికి తావులేకుండా ఎన్యూమరేటర్లు పక్కాగా సర్వే నిర్వహిస్తూ, ఆయా కుటుంబాలకు సంబంధించిన సమగ్ర వివరాలు సేకరించేలా చూడాలన్నారు. సూపర్వైజర్లు సర్వే తీరును క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ, ఎన్యుమరేటర్లు సేకరించిన వివరాలను నిశితంగా పరిశీలించాలని, తప్పులు లేకుండా ఆన్లైన్లో వాటిని నమోదు చేయించాలని అన్నారు. క్షేత్రస్థాయిలో ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తేవాలని, అన్ని వర్గాల వారిని భాగస్వాములు చేస్తూ ఇంటింటి కుటుంబ సర్వేను విజయవంతం చేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ అంకిత్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ట్రైనీ కలెక్టర్ సంకేత్ కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, డీఈఓ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌పై నుంచి పడి వ్యక్తి మృతి



ట్రాక్టర్‌పై నుంచి పడి మృతి చెందిన కాశీరాం

నవతెలంగాణ-బోధన్

మండలంలోని సంగం గ్రామంలో శనివారం ట్రాక్టర్‌పై కూలీ పనికి వెళ్తున్న కాశీరాం అనే వ్యక్తి ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కిందపడి మృతి చెందినట్లు బోధన్ రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పాత వర్ని గ్రామానికి చెందిన పలువురు కూలీలు ట్రాక్టర్‌పై కూలీ పనుల నిమిత్తం భవానీపేట్ వెళ్తున్నారు. ఈ క్రమంలో సంగెం గ్రామం వద్ద టిఫిన్ చేస్తానని చెప్పి పాత వర్నికి చెందిన చెందిన కాశీరాం (45) అనే వ్యక్తి నడుస్తున్న ట్రాక్టర్ ట్రాలీకి మధ్యలో ఉన్న రాడ్డుపై నిల్చోవడంతో ప్రమాదవశాత్తు కాలుజారి పడి కాశీరాం ట్రాలీ వెనుక చక్రాల కింద పడిపోవడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని హాసకొత్తూర్ గ్రామానికి చెందిన నేవూరి హన్మాండ్లు (65) జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు కమ్మర్‌పల్లి ఎస్ఐ అనిల్ రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి.. హాసకొత్తూర్ గ్రామానికి చెందిన నేవూరి హన్మాండ్లు మతిస్థిమితం బాగా లేక, భార్య చనిపోవడం వల్ల ఒంటరిగా ఉంటున్నాడు. ఒంటరి జీవితంతో మనస్థాపానికి గురై జీవితంపై విరక్తి చెంది గ్రామంలోని పెద్దమ్మ గుడి వద్ద గల బర్ల మంద దగ్గర పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డట్లు తెలిపారు. మృతుడి కొడుకు నరేందర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

విద్యుత్ షాక్‌తో మూడు పశువులు మృత్యువాత



విద్యుత్ షాక్‌తో మృతి చెందిన పశువులు

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి బైపాస్ రోడ్డు వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్ తగిలి మూడు పశువులు మృత్యువాతపడ్డాయి. ఈ ఘటన శనివారం చోటుచేసుకుంది. మామిడిపల్లికి చెందిన మల్యాల పెద్ద భోజన్నవి రెండు, ఆకుల రాజేశ్వర్‌కు చెందిన మరో పశువు మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు.

లింగంపేట్ గ్రంథాలయ నిర్వాహకులుగా మల్లారెడ్డి

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని గ్రంథాలయ నిర్వాహకులుగా మల్లారెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు లింగంపేట్ గ్రంథాలయ నిర్వాహకులుగా పనిచేసిన పెద్దపుల శ్రీనివాస్ గాంధారి, సదాశివనగర్ మండలాలకు బాధ్యతలపై వెళ్లారు. ఆయన స్థానం ఖాళీ కావడంతో ఎర్రపాడు గ్రంథాలయం పాలకులుగా పనిచేస్తున్న మల్లారెడ్డికి లింగంపేట్ గ్రంథ పాలకులుగా బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠకులు తమ విలువైన సమయాన్ని కేటాయించాలని, లింగంపేట్ గ్రంథాలయంలో అన్ని రకాల పుస్తకాలను అందుబాటులో ఉంచామన్నారు. నిరుద్యోగ యువతీ యువకుల కోసం పోటీ పరీక్షలకు పుస్తకాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విద్యార్థిని మంత్రగాడి దగ్గరికి తీసుకెళ్లిన టీచర్‌పై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న పిడిఎస్‌యు నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

మాక్లూర్ కేజీబీవీలో 6వ తరగతి చదువుతున్న సహస్ర అనే దళిత విద్యార్థిని మంత్రగాడి దగ్గరికి తీసుకెళ్లిన టీచర్ గౌతమిరెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పి.డి.ఎస్.యు ఆధ్వర్యంలో డీఈఓకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పిడిఎస్యు జిల్లా ప్రధాన కార్యదర్శి కే.గణేష్ మాట్లాడుతూ.. మాక్లూర్ కేజీబీవీలో సోషల్ సీఆర్టీగా పనిచేస్తున్న గౌతమిరెడ్డి తన బంగారు గొలుసు పోయిందని సహస్ర అనే 6వ తరగతి విద్యార్థినిని నిజామాబాద్, మాలపల్లిలో గల ఫకీరు దగ్గరికి తీసుకువెళ్లి మంత్రాలు (అంజనం) చేయించిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిందన్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ భావజాలాన్ని పెంచాల్సిన టీచర్లే, ఇలా మూఢనమ్మకాలను ఆశ్రయించడం దారుణమన్నారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు నాయకులు నాగేష్, సతీష్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బంది పెడితే చర్యలు

- ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి
- ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు

నవతెలంగాణ-సదాశివపగర్/బోధన్

సొసైటీ సిబ్బంది, నిర్వాహకులు రైతులను ఇబ్బంది పెడితే చర్యలు తప్పవని ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు హెచ్చరించారు. శనివారం మండలంలోని కుప్రియాల్ గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ మద్దతు ధర పొందాలని రైతులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో అవకతవకలు లేకుండా రైతులకు మోసం జరగకుండా తూకం వేయాలని అన్నారు. కొనుగోలు కేంద్రాలలో ఎవరైనా అక్రమ వసూళ్లకు పాల్పడితే తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే తెలిపారు. రైతులను ఇబ్బంది పెడితే సహించేది లేదని హెచ్చరించారు. రైతులు సంతోషంగా ఉంటే గ్రామాలు, రాష్ట్రాలు, మన దేశం సుభిక్షంగా ఉంటుందని అన్నారు.

హూన్సా సొసైటీలో..

బోధన్ : హూన్సా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చైర్మెన్ మంధర్న రవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సహకారం కోసం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని కావున రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే సన్నరకం ధాన్యానికి త్వరలో ప్రభుత్వం బోనస్ అందించే అవకాశం ఉందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమ ప్రభుత్వమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మెన్ చీల శంకర్, బోధన్ మండల వ్యవసాయ అధికారి సంతోష్, సంఘ ఉపాధ్యక్షులు కులకర్ణి వినోద్‌రావు, డైరెక్టర్స్ సంజీవ్ పటేల్, మర్కల్ శివకుమార్, మురిగే మాధవరావు, దేశ్‌పేట్ రాములు, ముద్దా సంగారం, గుమ్మడి భూమన్న, చింతం మైసయ్య, హున్సా, ఖాజాపూర్, మందర్నా గ్రామాల రైతులు, సంఘ కార్యదర్శి హన్మంత్ రావ్, సంఘ సిబ్బంది పాల్గొన్నారు.



సదాశివనగర్ : మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు

ఆకతాయికి దేహశుద్ధి చేసిన విద్యార్థిని



నవతెలంగాణ-బోధన్

పాఠశాల నుంచి ఇంటికి వెళుతున్న క్రమంలో ఓ యువకుడు ప్రతిరోజు వెంటపడి వేధిస్తుండడంతో విసిగిపోయిన విద్యార్థిని ఆ ఆకతాయి యువకుడిని చెప్పుతో కొడుతూ దేహశుద్ధి చేసిన ఘటన శనివారం బోధన్‌లో చోటుచేసుకుంది. బోధన్ పట్టణంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని పాఠశాల ముగిసిన అనంతరం ఇంటికి వెళ్లే క్రమంలో ఓ యువకుడు ప్రతిరోజు వెంటపడి వేధిస్తుండడంతో ఆ బాలిక ఆమె కుటుంబ సభ్యులకు విషయం తెలిపింది. దాంతో బాలిక కుటుంబ సభ్యులు శనివారం రైల్వే గేటు వద్ద ఆకతాయి యువకుడిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. బాధిత బాలిక ఆ యువకుడిని చెప్పుతో దేహశుద్ధి చేసింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆకతాయి యువకుడిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

- ఎడపల్లి ఎంపీడీవో శంకర్ నాయక్



మాట్లాడుతున్న ఎంపీడీవో శంకర్ నాయక్

నవతెలంగాణ-ఎడపల్లి

గ్రామపంచాయతీ కార్యదర్శులతో పాటు ఉపాధ్యాయులు, గ్రామపంచాయతీ బీఎల్‌ఓలు, ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఎడపల్లి ఎంపీడీవో శంకర్ నాయక్ అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన గ్రామ పంచాయతీ కార్యదర్శులతో పాటు, గ్రామపంచాయతీ బిఎల్ఓ, అలాగే ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ నెల 6 నుంచి పక్షం రోజులపాటు, గ్రామ క్షేత్రస్థాయిలో ఇంటింటా సర్వేను పగడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. టీం వర్క్ అనేది చాలా ముఖ్యమైనదన్నారు. సర్వే నిర్వహించి సమయంలో ఆ గ్రామంలో ఒకరోజు ముందుగానే దండోరా వేయించాలని సూచించారు. సర్వే పూర్తి అయిన తర్వాత నివేదికలను మండల పరిషత్ కార్యాలయంలో అందజేయాలని ఆయన సూచించారు. సమావేశంలో ఎంపీఓ మన్మోహన్ శాస్త్రి, కంప్యూటర్ ఆపరేటర్ సుమలత, గ్రామపంచాయతీ కార్యదర్శుల యూనియన్ ఎడపల్లి మండలాధ్యక్షులు ఉదయ భాస్కర్, కార్యదర్శులు రామిరెడ్డి, గంగాధర్, పద్మావతి సురేష్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు ప్రక్రియ వెంటనే ప్రారంభిస్తాం

- రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోలు చేస్తాం
- ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి

నవతెలంగాణ-దోమకొండ

ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాలపై ఆయన శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ.. వడ్ల కొనుగోలు ప్రక్రియ వెంటనే ప్రారంభిస్తామని, రైతులకు ఇబ్బంది లేకుండా వడ్ల కొనుగోలు జరుగుతుందని తెలిపారు. కొన్ని కారణాల వల్ల కొనుగోలు ప్రక్రియ ఆలస్యం అయ్యిందని వివరించారు. నియోజకవర్గంలో రెండు చోట్ల ప్రారంభించామని తెలిపారు. అకాల వర్షాల వల్ల రైతులకు ఇబ్బందుల గురించి కలెక్టర్‌తో చర్చించామని, సోమవారం నుంచి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం అవుతుందన్నారు. లారీలు, కూలీ సమస్యల విషయమై ముందస్తు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. రైతులు, అధికారులు సమన్వయంతో ముందుకి పోవాలని సూచించారు. ప్రతి వారం ధాన్యం కొనుగోలు పక్రియపై సమీక్షా సమావేశం ఉంటుందన్నారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు భూపాల్‌రెడ్డి, రవీందర్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి

కాంగ్రెస్‌తోనే ప్రజా పరిపాలన

- జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్ రెడ్డి

నవతెలంగాణ-రామారెడ్డి

కాంగ్రెస్‌తోనే ప్రజా పరిపాలన కొనసాగుతుందని జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ఎన్నో సంవత్సరాల నుంచి ధరలు పెరిగినా.. గత ప్రభుత్వం పేద విద్యార్థుల మెస్ ఛార్జీలు పెంచకుండా ఇబ్బందులకు గురి చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం పేద విద్యార్థులకు మెరుగైన విద్యతోపాటు పౌష్టికాహారం అందించాలని, 40 శాతం మెస్‌చార్జీలు పెంచి పేద విద్యార్థులకు ప్రభుత్వం ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. బిసి గణనను చేపట్టి, అన్ని వర్గాల అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని పేర్కొన్నారు. గత పది సంవత్సరాల నుండి ఉపాధ్యాయ నియమకాలు చేపట్టక విద్య కుంటుపడిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధ్యాయ నియమకాలు చేపట్టి, పేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడమే లక్ష్యంగా పునర్ ప్రారంభించి విద్యను అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు.

వారి ధాన్యం తూకం ప్రారంభం

- ఏపీఎం శ్రీనివాస్

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని భవానిపేట్ గ్రామ సమీపంలో వరి ధాన్యం తూకంను శనివారం ప్రారంభించినట్టు ఐకెపి ఎపిఎం శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు, రైతులు పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కామారెడ్డి
ఆదివారం | నవంబర్ 03, 2024 | www.navatelangana.com

ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభం



నవతెలంగాణ-సదాశివనగర్

ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో మండల సమైక్య ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్‌రావు శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈఓ చందర్ నాయక్, డీఆర్డీఓ సురేందర్, ఆర్డీవో రంగనాథరావు, ఎమ్మార్వో గంగాసాగర్, ఎంపీడీవో సంతోష్ కుమార్, ఎంపీవో సురేందర్, అడిషనల్ డిఆర్‌డిఓ మురళీకృష్ణ, డిపిఎం రవీందర్, డిపిఎం రమేష్ బాబు, ఇతర ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు, పాల్గొన్నారు.

ఊట్పల్లిలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



నవతెలంగాణ-బోధన్

మండలంలోని ఊట్పల్లి, రాజీవ్‌నగర్ తాండా గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శనివారం పంపిణీ చేశారు. సురేష్ నాయక్‌కు రూ.54,000, సుశీలకు 24,000, ఆరిఫ్ మహమ్మద్‌కు 12500 చెక్కులను ఆయా లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ గంగా శంకర్, బోధన్ కాంగ్రెస్ మండలాధ్యక్షులు నాగేశ్వర్‌రావు, నియోజకవర్గ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నరేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రవిదాస్, గ్రామ కాంగ్రెస్ సీనియర్ నాయకులు టప్పా సాయిలు, బల్లేపు నర్సయ్య, జమీల్, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

అణగారిన వర్గాలకు ఉపయోగపడేలా

సమగ్ర కుల గణన సర్వే

- నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి
- కాంగ్రెస్ జిల్లా విస్తృత స్థాయి సమావేశం

నవతెలంగాణ-కంఠేశ్వర్

అణగారిన వర్గాలకు ఉపయోగపడే విధంగానే సమగ్ర కుల గణన సర్వేను ప్రభుత్వం చేపడుతుందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. శనివారం కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మనాల మోహన్‌రెడ్డి అధ్యక్షతన జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ జిల్లా విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా నూతనంగా నియమింపబడిన మార్కెట్ కమిటీ అధ్యక్షులకు, జిల్లా గ్రంథాలయ చైర్మన్‌కు సన్మానం చేశారు. ఈ సందర్భంగా రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ.. సమగ్ర కుల గణన అనేది అన్ని వర్గాల ప్రజలకు మంచి జరగడానికే అని, కులగణన జరిగితే కులంలో ఎందరు ఉన్నారో ఎవరికి ఏ విధంగా న్యాయం చేయగలమో అనే ఉద్దేశంతో ఈ కార్యక్రమ చేపడుతున్నట్టు తెలిపారు. కుల సర్వే చేయించడం వల్ల కుటుంబాల ఆర్థిక పరిస్థితి, ఉపాధి ఎలా అనే విషయాలు పరిగణనలోకి వస్తాయని, అందుకే దీనిని సమగ్ర కుటుంబ కుల సర్వేగా చేపట్టడం జరిగిందని, ఇది ఎన్నికలకు ముందే తీర్మానించామని తెలిపారు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత అసెంబ్లీలో తీర్మానం చేశామని వివరించారు. కులగణన అనేది ప్రభుత్వ కార్యక్రమమైనా.. కాంగ్రెస్ పార్టీ నాయకులందరూ ఇందులో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన అన్నారు. పూర్తిగా ఉపకులాల వారీగా జాబితా ప్రభుత్వాల వద్ద లేదని వివరించారు. బిజెపి పెద్దలు సామాజిక న్యాయం చేస్తామని చెప్పున్నారని, కానీ కులగణన చేయలేదని తెలిపారు. పేదలకు న్యాయం జరగాలన్నా, ఉపాధి కావాలన్నా ఆర్థికంగా ఎదగాలన్నా ఒక నిర్దిష్ట జాబితా ఉండాలని, దాని కోసమే కుల గణన అనేది ముఖ్యమని ఆయన అన్నారు. తెలంగాణలో కులగణన చేసి అందరికీ న్యాయం అందించి దేశానికి ఆదర్శంగా నిలబడటమే ప్రభుత్వ ఆలోచన అని, అందరూ సర్వేలో పాల్గొనాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సమగ్ర సర్వేలో మన జిల్లాలో గ్రామ పంచాయితీ సెక్రటరీలు, ఆశావర్కర్లు, ఉపాధ్యాయులు ఉన్నారని, వారు సజావుగా సర్వే నిర్వహించడానికి కాంగ్రెస్ కార్యకర్తలుగా వారి వెంట ఉండి వారికి సహకరించాలని తెలిపారు. డిసెంబర్ 9వ తేదీ వరకు సర్వే పూర్తవ్వాలనే అజెండాతో ముందుకు వెళ్తున్నట్టు తెలిపారు. ఈ ప్రాతిపదికన జనాభాను బట్టి రిజర్వేషన్ నిర్ణయించవచ్చని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నిర్ణయమని, కావున అందరూ పాల్గొనాలని మానాల మోహన్‌రెడ్డి కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతారెడ్డి రాజారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, ఐడీసీఎంస్ చైర్మన్ తారాచంద్, డిసిసిబి వైస్ చైర్మన్ చంద్రశేఖర్, రాష్ట్ర కాంగ్రెస్ ప్రచార కమిటీ మెంబర్ జావేద్ అక్రమ్, పీసీసీ కార్యదర్శి వేణుగోపాల్ యాదవ్, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రామార్తి గోపి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు విక్కీ యాదవ్, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు వేణు రాజ్, పిసిసి డెలిగేట్ శేఖర్ గౌడ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు లింగం, వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముత్యంరెడ్డి, కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య, ఆర్మూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబా గౌడ్, కార్పొరేటర్ రోహిత్, మహిళా కాంగ్రెస్ నాయకులు, వివిధ మండలాల అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన చైతన్య విద్యార్థిని



మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-భిక్కనూర్

రాష్ట్రస్థాయి అండర్ 19 క్రికెట్ బాలికల పోటీలకు మండల కేంద్రంలోని శ్రీ చైతన్య విద్యా నికేతన్‌లో ఎనిమిదవ తరగతి చదువుతున్న మహన్విత ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ బూర్ల రేణు కుమార్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా స్థాయిలో నిర్వహించిన క్రికెట్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర అండర్ 19 బాలికల క్రికెట్ పోటీలకు ఎంపికయింది. ఈ సందర్భంగా విద్యార్థినిని పాఠశాల కరస్పాండెంట్ రేణుకుమార్, ప్రిన్సిపాల్ అశోక్ యాదవ్, పాఠశాల ఉపాధ్యాయులు, పట్టణవాసులు అభినందించారు.

అండర్ 19 క్రికెట్ రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థిని



విద్యార్థినిని సన్మానించిన ఉపాధ్యాయ బృందం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు చెందిన ఎంపీసీ రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని బి.హేమలత క్రికెట్ అండర్ 19 రాష్ట్ర స్థాయిలో పాల్గొనే జట్టుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ బుద్ధిరాజ్ విద్యార్థిని హేమలతను శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సభ్యత్వ నమోదు

నవతెలంగాణ-తాడ్వాయి

టిఎన్‌జిఓ ఉద్యోగుల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కామారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో తాడ్వాయి తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. జిల్లాలోని అన్నీ మండల కేంద్రాల్లో సభ్యత్వ కార్యక్రమాన్ని సత్వరమే పూర్తిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ



విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ చేసిన పలువురు

నవతెలంగాణ-ధర్పల్లి

మండలంలోని దుబ్బాక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని వంద మంది విద్యార్థులకు గానూ గ్రామంలోని దాతలు శనివారం క్రీడా దుస్తులను అందించినట్టు పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు ఎస్.సత్యం తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల బలోపేతంలో భాగంగా తమ గ్రామంలోని ఇదే పాఠశాలలో తాము విద్యాభ్యాసం చేశామని తెలిపారు. తమ గ్రామ పాఠశాలకు తమవంతు సహకారం అందించాలనే సంకల్పంతో విద్యార్థులకు క్రీడా దుస్తులు అందించినట్టు తెలిపారు. దాతలు యం.అశ్విన్ 30 డ్రెస్సులు, మరిపెద్ది సుప్రజ్ 10, కానిస్టేబుల్ విజయలక్ష్మి 10, హరీష్ 10 డ్రెస్సులతోపాటు, 2013-14 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు 10 డ్రెస్సులు, అలాగే పూర్వ విద్యార్థులైన గంగా సావిత్రి, బాబు కృష్ణ, సాయికిరణ్, శ్రీనివాస్‌రెడ్డి, నాగుల కళ్యాణి, మల్లికార్జున్ బృందం మరో 30 డ్రెస్సులను అందించినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే పైచదువులు చదివిన అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, విద్యార్థులకు సరైన పద్ధతిలో పాఠ్యాంశాలను బోధిస్తారని, వాటిని అందిపుచ్చుకుని విద్యార్థులు రాణించాలని, ప్రతి విద్యార్థికి మంచి భవిష్యత్తును నిర్ధారించేది 10వ తరగతియేనని తెలిపారు. శ్రద్ధగా చదివి మంచి మార్కులు సాధించి.. తల్లి తండ్రులు, ఉపాధ్యాయుల పేరు నిలబెట్టాలన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈఓ రమేష్, పిఆర్‌టియు మండల అధ్యక్షుడు వెంకట్ రాజారెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విడిసి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ సందర్శన



పోలీసుల వేషాధారణలో విద్యార్థులు

నవతెలంగాణ-మోర్తాడ్

మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను స్థానిక కృష్ణవేణి పాఠశాల విద్యార్థులు శనివారం సందర్శించారు. ప్రతి శనివారం జనరల్ ఆక్టివిటీస్ సందర్భంగా పోలీస్ స్టేషన్ నిర్వహణ, పోలీసుల విధి నిర్వహణపై విద్యార్థులకు పూర్తి అవగాహన కల్పించారు. పోలీసులు నిర్వహించే విధి నిర్వహణ బాధ్యతలపై విద్యార్థులకు తెలియజేస్తూ ప్రతి ఒక్కరూ మంచి మార్గంలో నడవాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాల విద్యార్థులకు ఏఎస్ఐ పోలీస్ స్టేషన్ విధి నిర్వహణపై విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మోసిన్ జాబ్రి, డైరెక్టర్స్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు వేధింపులు మానుకోవాలి

- సిఐటియు నాయకులు నన్నేసాబ్

నవతెలంగాణ-కోటగిరి

గ్రామపంచాయతీ కార్మికులపై అధికారులు వేధింపులు మానుకోవాలని, అవసరనిమిత్తం రెండు రోజులు విధులకు రాలేకపోతే వేతనంలో కోతలు పెట్టడం సరైంది కాదని అధికారులు పద్ధతి మార్చుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నన్నేసాబ్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్మికులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించి, నెలకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని, పీఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, అధికారుల వేధింపులు మానుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈనెల 6న నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్ (ఎన్‌టీఆర్ చౌరస్తా) వద్ద ఒక రోజు నిరాహార దీక్ష చేపట్టనున్నామని తెలిపారు. మండలంలోని గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మికులందరూ సకాలంలో పాల్గొని, నిరాహార దీక్షను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆనంద్, పోశెట్టి, సాయిలు, బ్రహ్మం, లక్ష్మి, గంగవ్వ, సాయవ్వ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు నాయకులు నన్నేసాబ్

రైతులు జాగ్రత్తలు పాటించాలి

- విద్యుత్ శాఖ ఎస్ఈ రమేష్ బాబు
- విద్యుత్ ప్రమాదాల నివారణపై రైతులకు అవగాహన


నవతెలంగాణ-భిక్కనూర్

విద్యుత్ ప్రమాదాల నివారణకు రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని, విద్యుత్ శాఖ ఎస్ఈ రమేష్ బాబు తెలిపారు. శనివారం మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామ శివారులో పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు తమ వ్యవసాయ పొలాల వద్ద ఉండే ట్రాన్స్‌ఫార్మర్‌లు, బోరు కనెక్షన్ల వద్ద జాగ్రత్తలు పాటించాలని, విద్యుత్ సర్వీస్ వైరును ఎప్పటికప్పుడు సరిచూసుకోవాలని, రాత్రి వేళల్లో విద్యుత్ ఇనుప డబ్బాలను ముట్ట వద్దని తెలిపారు. రైతులకు ఏవైనా సమస్యలు వస్తే వెంటనే స్థానిక విద్యుత్ అధికారులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ డిఈ కళ్యాణ్ చక్రవర్తి, నాగరాజు, ఏడిఈ సుదర్శన్‌రెడ్డి, ఏఈ సంకీర్త్, విద్యుత్ సిబ్బంది మాణిక్యం, గ్రామ రైతులున్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

చార్జీలు పెంచడం పట్ల విద్యార్థుల హర్షం



ప్లకార్డులతో సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్న విద్యార్థులు

నవతెలంగాణ-మోర్తాడ్

మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావుపూలే బాలుర పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు శనివారం హర్షం వ్యక్తం చేశారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన భోజన సౌకర్యాలు అందించడానికి ప్రభుత్వం మెస్ చార్జీలు పెంచడం పట్ల ఉపాధ్యాయులు, పాఠశాల విద్యార్థులు సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలను ఉంచుతూ హర్షం వ్యక్తం చేశారు. మెస్ చార్జీలు పెంచడం పట్ల విద్యార్థులకు మెరుగైన పోషణ ఆహారాలు అందిస్తామని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

కాలభైరవ స్వామి ఆలయంలో సామూహిక దీపార్చన

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని ఇసన్నపల్లి (రామారెడ్డి)లో వెలసిన శ్రీ కాలభైరవ స్వామి ఆలయంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకొని ప్రతిరోజు సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు ఆలయంలో సామూహిక దీపార్చన కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణ అధికారి ప్రభు రాంచంద్రం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

ఓపెన్ ఎంబీఏ ట్యూషన్ ఫీజు చెల్లింపు కోసం 15 వరకు గడువు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం ఎం.బి.ఏ. కోర్సులో చేరడానికి నోటిఫికేషన్ విడుదల చేసింది.

ఆ కోర్సులో చేరడానికి నవంబర్ 15 చివరి తేదీ అని గిరిరాజ్ కళాశాల పిన్సిపాల్ డా.ఎ.రామ్మోహన్‌రెడ్డి, అధ్యాయన కోఆర్డినేటర్ కే.రంజిత ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్లైన్‌లో నమోదు తదితర అంశాలపై అధ్యాయన కేంద్రాన్ని సంప్రదించాలని తెలిపారు. అలాగే డిగ్రీ, పీజి అడ్మిషన్ల గడువు, ద్వితీయ, తృతీయ సంవత్సర రెన్యువల్ గడువును నవంబర్ 15 వరకు పొడిగించినట్టు పేర్కొన్నారు. విద్యార్థులు ఈ విషయాన్ని గమనించి సకాలంలో ఆన్‌లైన్ ద్వారా ట్యూషన్ ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు యూనివర్సిటీ వెబ్సైట్ www.braouonline.inను సంప్రదించాలని సూచించారు. వివరాలకు 7382929612 ఈ నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

బ్రాహ్మణపల్లిలో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మెన్

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని బ్రాహ్మణపల్లిలో వరి కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్మన్ నల్లవెల్లి కపిల్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. కొనుగోళ్లలో సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. తూకంలో చిన్నపాటి వ్యత్యాసాలు ఉండొద్దని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ధర్మారెడ్డి, సభ్యులు మోహన్ రెడ్డి, రైతులు నర్సారెడ్డి, సీఈవో నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

వరిధాన్యాన్ని రహదారిపై ఆరబెట్టొద్దు

- ఎస్సై సాయి కుమార్

నవతెలంగాణ-భిక్కనూర్

వరి ధాన్యాన్ని రైతులు 44వ జాతీయ రహదారిపై ఆరబెట్టవద్దని ఎస్సై సాయి కుమార్ రైతులకు సూచించారు. శనివారం జాతీయ రహదారిపై రైతులు ఆరబెట్టిన వరిధాన్యపు కుప్పల వద్దకు వెళ్లి అవగాహన కల్పించారు. రోడ్డుపై ధాన్యం ఆరబెట్టడం వల్ల రోడ్డు ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని, రైతులు పండించిన ధాన్యాన్ని కల్లాలలో ఆరబెట్టుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని రైతులు వరి ధాన్యాన్ని జాతీయ రహదారిపై ఆరబెట్టకుండా పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్సై సాయికుమార్

దోమకొండ పంచాయతీ కార్యదర్శిగా యాదగిరి



పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరిస్తున్న యాదగిరి

నవతెలంగాణ-దోమకొండ

దోమకొండ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా యాదగిరి శనివారం బాధ్యతలు స్వీకరించారు. పిట్లం మండల కేంద్రం నుంచి దోమకొండకు బదిలీపై వచ్చామని తెలిపారు. ఇక్కడ పనిచేసిన పంచాయతీ కార్యదర్శి దయాకర్‌రెడ్డి బస్వాపురం గ్రామానికి వెళ్లారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది కిషన్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
ఆదివారం | నవంబర్ 03, 2024 | www.navatelangana.com

నేర దర్యాప్తులో మేలకులవలపై అవగాహన

నవతెలంగాణ-ఆర్మూర్



పట్టణంలోని కోర్ట్ ఆవరణలో నూతన చట్టాలు, నేర దర్యాప్తులో మెలకువలపై డివిజన్‌లోని పోలీసులకు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామకృష్ణ శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నూతన చట్టాలు, వాటిపై అవగాహన, నేర దర్యాప్తులో పాటించవలసిన మెలకువల ను అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోలీసులకు వివరించారు. ఈ కార్యక్ర మంలో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాస్ ఖాందేశ్, స్టేషన్ హౌస్ ఆఫీ సర్ వి.రవికుమార్, రూరల్ సీఐ కె.శ్రీధర్‌రెడ్డి, భీంగల్ సీఐ నవీన్ కుమార్, అన్ని పోలీస్ స్టేషన్‌ల ఎస్ఐలు, కోర్ట్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ధర్మయుద్ధ మహాసభను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-కామారెడ్డి



మాట్లాడుతున్న నాయకులు

కామారెడ్డిలోని ఈఎస్ఆర్ గార్డెన్‌లో ఆదివారం నిర్వహించే ధర్మయుద్ధ మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి బట్ట వెంకట్ రాములు అన్నారు. శనివారం నిర్వహించే విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మందకృష్ణ మాదిగ రానున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదగిరి, కుత్తుల పుల్లూరి పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

బేషాజాలకు వెళ్లబోం..
ప్రజలకు అండగా ఉంటాం

- పెండింగ్ సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్నాం
- ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ షబ్బీర్ అలీ
- పలువురు బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-కామారెడ్డి

తాము బేషాజాలకు వెళ్ళబోమని, పేదలకు సహాయంగా అండగా ఉంటూ నియోజకవర్గ ప్రజల మంచి మాత్రమే కోరుకుంటామని ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ షబ్బీర్ అలీ అన్నారు. గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న సిఎంఆర్ఎఫ్ చెక్కులను



చెక్కులను పంపిణీ చేస్తున్న ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ షబ్బీర్ అలీ

బాధితులకు అందిస్తున్నామని ఆయన తెలిపారు.

కామారెడ్డి పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ షబ్బీర్ అలీ కామారెడ్డి నియోజకవర్గానికి చెందిన పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్దిదారులకు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న సిఎంఆర్ఎఫ్ ఫైళ్లను ముఖ్యమంత్రితో మాట్లాడి కామారెడ్డి నియోజకవర్గంలో దాదాపు 300 మందికి సీఎం సహాయ నిధి నుంచి నిధులు మంజూరు చేయించినట్టు తెలిపారు. చెక్కులు ఎవరు పంచారనేది ముఖ్యం కాదని.. ఎవరు మంజూరు చేయించారనేది ముఖ్యమన్నారు.

పూలకుండి పేలి బాలుడికి గాయాలు

నవతెలంగాణ-ఆర్మూర్



పూలకొండి పేటి కాలిన బాలుడి చేయి

పూలకుండి పేలి బాలుడికి గాయాలయ్యాయి. ఈ ఘటన పట్టణంలోని హుస్నాబాద్ గల్లీలో శనివారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. పట్టణానికి చెందిన దినేష్ చంద్ర అనే బాలుడు శనివారం పటాకులు కాలుస్తుండగా పూలకుండి పేలడంతో చేతికి గాయాలయ్యాయి. దీంతో ఆ బాలుడిని కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. పూలకొండి పేలడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యాపారులు నాసీరకం పటాకులు విక్రయించడంతో ఈ ఘటన చోటుచేసుకుందని బాలుడి కుటుంబ సభ్యులు ఆరోపించారు.

విద్యార్థులకు చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-ధర్పల్లి

మండలంలోని దుబ్బాక గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉల్లాస్ స్వచ్ఛంధ సేవా సంస్థ ప్రతినిధి అశ్విన్ 30 మంది విద్యార్థులకు శనివారం చెక్కులు అందించినట్లు ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు సైరా సత్యం తెలిపారు. విద్యార్థులు మంచి చదువులు చదివి భవిష్యత్తుకు మంచి బాటలు వేసుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఈఓ రమేష్, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు వెంకట్ రాజారెడ్డి, ఉపాధ్యాయులు, విడిసి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాల సీనియర్ బాల్ బ్యాడ్మింటన్



సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

క్రీడాకారుల ఎంపిక

నవతెలంగాణ-ఆర్మూర్

70వ సీనియర్ రాష్ట్రస్థాయి బాల్ బ్యాట్మింటన్ క్రీడా పోటీలకు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని విజయ్ హైస్కూల్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షులు మానస గణేష్ మాట్లాడుతూ.. క్రీడాకారులు జిల్లా జట్టు ను ప్రథమ స్థానంలో నిలుపాలని, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఎంపికైన క్రీడాకారులకు శిక్షణ శిబిరం నిర్వహించి మహిళలకు మోర్తాడ్ గర్ల్స్ హైస్కూల్, పురుషులకు రెంజల్ హైస్కూల్‌లో శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఈనెల 8 నుంచి 11వరకు జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం హనుమకొండలో జరిగే 70వ తెలంగాణ రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల, మహిళా బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌కు జిల్లా జట్టుకు ప్రాతినిథ్యం వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయ హైస్కూల్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కవిత, దివాకర్, జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్యామ్, సీనియర్ క్రీడాకారులు, ఆర్అండ్‌బి ఇంజనీర్ నాందేవ్, కామారెడ్డి జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, సంఘ సభ్యులు సురేష్, సింధుజ, శ్యామల పాల్గొన్నారు.

కొప్పర్గలో పేకాటరాయుళ్ల అరెస్ట్

- నగదు స్వాధీనం

నవతెలంగాణ-బోధన్

బోధన్ మండలంలోని కొప్పర్గ గ్రామంలో శనివారం పేకాటాడుతున్న ఏడుగురిని బోధన్ రూరల్ పోలీసులు పట్టుకుని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 8 సెల్‌ఫోన్లు, రూ.93,730 స్వాధీనం చేసుకున్నట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చుందర్‌రెడ్డి తెలిపారు. అలాగే అనుమతి లేకుండా అక్రమ ఇసుక రవాణా చేస్తున్న 5 ఇసుక ట్రాక్టర్లను రెవెన్యూ సిబ్బందితో కలిసి పట్టుకున్నట్లు ఆయన తెలిపారు.

డీఎస్సీలో ఉపాధ్యాయ ఉద్యోగం

- డీఈవో చేతుల మీదుగా ఆర్డర్ కాపీ

నవతెలంగాణ-లింగంపేట్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన డిఎస్సిలో మండలంలోని నల్లమడుగు గ్రామానికి చెందిన సంజీవులు అర్హత సాధించి ఉద్యోగానికి ఎంపికయ్యారు. దీంతో జిల్లా విద్యాశాఖ అధికారి రాజు చేతుల మీదుగా కార్యాలయంలో జాయినింగ్ ఆర్డర్ కాపీని అందుకున్నారు. బిబిపేట మండలంలోని తిమ్మయ్యగారి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాయినింగ్ ఆర్డర్ అందజేశారు. గత 12 సంవత్సరాల నుంచి లింగంపేట్ మండలంలోని నల్లమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్లస్టర్ రిసోర్స్‌గా పని చేస్తున్నారు. ఉపాధ్యాయుడిగా బాధ్యతలు స్వీకరించడంతో గ్రామస్తులు, స్నేహితులు ఆయనను అభినందించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు గురుకుల విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న పలువురు

నవతెలంగాణ-ఆర్మూర్

మహబూబ్‌నగర్ రాచర్ల అడక్కుల్‌లో 3, 4 ,5 తేదీలల్లో జరిగే తెలంగాణ రాష్ట్రస్థాయి అండర్ -19 ఎస్‌జిఎఫ్ కబడ్డీ పోటీలకు పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల కళాశాలకు చెందిన విద్యార్థులు చందు, ఉమేష్‌చంద్ర ఎంపికైనట్లు పాఠశాల కళాశాల ప్రిన్సిపాల్ పూర్ణ చందర్ శనివారం తెలిపారు. రాష్ట్రస్థాయి అండర్ 19 కబడ్డీ పోటీలలో విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచి పోటీలలో పాల్గొనాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ సాయన్న, జెవిపి దయానంద్, చక్రపాణి, ప్రేమ్, వ్యాయామ ఉపాధ్యాయులు పిడి జ్ఞానేశ్వర్, పీఈటి రాజేందర్, పాఠశాల కళాశాల నాన్ టీచింగ్ స్టాఫ్ తదితరులు విద్యార్థులను అభినందించారు.

దేశాయి బీడీ యాజమాన్యం
కార్మికులను వేధించడం ఆపాలి

- సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.చంద్రశేఖర్

నవతెలంగాణ-కామారెడ్డి

దేశాయి బీడీ యాజమాన్యం కార్మికులను వేధించడం ఆపాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. దేశాయి బీడీ కంపెనీ కార్మికుల పట్ల వేధింపులు మానుకోవాలని కోరుతూ తెలంగాణ బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో లేబర్ కమిషనర్‌కు శనివారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాయి బీడీ కంపెనీ యాజమాన్యం చేస్తున్న దోపిడీని వివరించారు. కార్మికుల నుంచి పది రూపాయలు వసూలు చేస్తున్నారని, దాంతో కార్మికులు నష్టపోతున్నారని తెలిపారు. అలాగే చాటన్, శాంపిల్ పేరుతో తీసుకుంటున్న బీడీని తక్షణమే ఆపివేయాలన్నారు. లేకుంటే హైదరాబాద్ సీఎం క్యాంప్ ఆఫీసులో ఫిర్యాదు చేస్తామని, సిఐడి ఎంక్వయిరీ కోరుతామని హెచ్చరించారు. ఇకనైనా యాజమాన్యం తన తప్పు తెలుసుకొని కార్మికులకు జరుగుతున్న అన్యాయాన్ని ఆపేయాలని అన్నారు. ఇది ఇలాగే కొనసాగితే తాము తెలంగాణ బీడీ అండ్ సిగర్ వర్కర్స్



వినతిపత్రాన్ని అందజేస్తున్న సిఐటియు నాయకులు

యూనియన్ సిఐటియుగా ఎలాంటి పోరాటాలకైనా సిద్ధమని యాజమాన్యాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి కర్రోల్ల సత్యం, జిల్లా నాయకులు బోనగిరి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ఏవైఎస్ గ్రామ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మండల పరిధిలోని సాతెల్లి గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం నూతన గ్రామ కమిటీని జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బిట్ల సురేందర్ ఆధ్వర్యంలో శనివారం ఎన్నుకున్నట్లు మండల ప్రధాన కార్యదర్శి కుశల కంటి సాయిలు తెలిపారు. సాతెల్లి గ్రామ అధ్యక్షులుగా బ్యాగరీ సాయిలు, ఉపాధ్యక్షులుగా చంద్రయ్య, శివలింగం, ప్రధాన కార్యదర్శిగా సత్యగారి సాయిలు, కార్యదర్శులుగా ప్రశాంత్, మానెయ్య, కోశాధికారిగా భూషణం, సలహాదారులుగా కృపానందం, సామెల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ అధ్యక్షులు మర్లు సాయిబాబా, సంజీవులు, రాములు, ఏవన్, మహేష్, సందీప్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మేకలకు తగిన వైద్యం అందించాలి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మండల పరిధిలోని తిమ్మారెడ్డి తాండకు చెందిన పలువురి మేకలు దొబ్బరోగంతో వరుసగా మృతి చెందుతున్నాయని.. అందుకు తగ్గట్టుగా పశువైద్యులు మేకలకు తగిన వైద్యం అందించాలని కాంగ్రెస్ పార్టీ ఎల్లారెడ్డి మండల అధ్యక్షులు కురుమ సాయిబాబా కోరారు. శనివారం తిమ్మారెడ్డి తండా మేకల యజమానులను కలిసి ఆయన పరామర్శించారు. అనంతరం ఎల్లారెడ్డి మండల పశువైద్యులు డాక్టర్ రవితో ఫోన్‌లో మాట్లాడి మేకలకు సోకుతున్న వ్యాధి నిర్మూలనకు తగిన వైద్యం అందించాలని విజ్ఞప్తి చేశారు. అక్కడి నుంచి తిమ్మారెడ్డి గ్రామానికి చేరుకొని ఇటీవల మరణించిన దండురత్నయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించి ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ మండల అధ్యక్షులు నాగం శ్రీనివాస్, ప్రకాష్, కిష్టయ్య, రాజు, సాయిలు, వెంకట్, మదర్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్ర అగ్రికల్చర్ అండ్ ఫార్మర్ కమిషన్ కమిటీ మెంబర్‌గా గడుగు గంగాధర్

- బాధ్యతలు స్వీకరణ

నవతెలంగాణ-కంఠేశ్వర్



తెలంగాణ రాష్ట్ర అగ్రికల్చర్ అండ్ ఫార్మర్ కమిషన్ కమిటీ మెంబర్‌గా గడుగు గంగాధర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన సీనియర్ నాయకులు గడుగు గంగాధర్‌కు ఇటీవల కమిషన్ మెంబర్‌గా బాధ్యతలు అప్పజెప్పగా శనివారం బాధ్యతలు స్వీకరించారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పజెప్పిన రాష్ట్ర నాయకులకు ధన్యవాదాలు తెలియజేశారు. అందరూ సమన్వయంతో కలిసి పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అగ్రికల్చర్ అండ్ ఫార్మర్ కమిషన్ కమిటీ చైర్మన్ కోదండరెడ్డి, ఎమ్మెల్సీ కోదండరాం, డైరెక్టర్లు, కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

- జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి
- పలు పోటీల్లో గెలుపొందిన అభ్యర్థులకు బహుమతులు అందజేత

నవతెలంగాణ-కామారెడ్డి

ఎయిడ్స్‌పైన అవగాహన ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలోని, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో యూత్ ఫెస్టివల్‌లో భాగంగా పాఠశాల విద్యార్థులకు, కళాశాల విద్యార్థులకు హెచ్ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలోని, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో యూత్ ఫెస్టివల్‌లో భాగంగా పాఠశాల విద్యార్థులకు, కళాశాల విద్యార్థులకు హెచ్ఐవి, టీబి, రక్తదానంపైన జిల్లా స్థాయి రెడ్‌రన్, క్విజ్ పోటీలు, డ్రామా, రీల్స్ పోటీలను నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రతీ విభాగం నుంచి మొదటి బహుమతి రూ.1000, ద్వితీయ బహుమతి రూ.750, అలాగే తృతీయ బహుమతి రూ.500 క్యాష్ ప్రైజ్లను శనివారం అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు.



గెలుపొందిన అభ్యర్థులకు బహుమతులు అందజేస్తున్న అదనపు కలెక్టర్

ఈ కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ రాధిక, డిపిఎం సుధాకర్, డిఏఏ మహేష్, సౌత్ క్యాంపస్ ప్రొఫెసర్ అంజయ్య, విద్యార్థులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, ఎస్ఆర్‌కె డిగ్రీ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు టీచర్లు, లెక్చరర్స్ పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



పశువులకు గాలికుంటు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని మాందాపూర్ గ్రామాలో పశు వైద్య, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలను పశు వైద్యాధికారులు డా.కిరణ్ దేశ్‌పాండే, ఉమామ సహెర్ ఆధ్వర్యంలో శనివారం వేశారు. ఈ సందర్భంగా 109 పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్టు తెలిపారు. ప్రతిరైతూ తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని సూచించారు. ఈ వ్యాధి వల్ల పాల ఉత్పత్తి తగ్గుతుందని, అతిజ్వరం కలిలో పుండ్లు, నోటి పుండ్లు ఎక్కువగా ఉంటాయని తద్వారా పునరుత్పత్తి సామర్థ్యం తగ్గుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఎల్ఓ వినిత, జేవీఓ కల్యాణి, వీఏ పాషా గంగాధర్, ఓఎస్ పుష్ప, హెచ్ఏ మహేశ్వర్, గోపాలమిత్ర సుధీర్, రైతులు పాల్గొన్నారు.

తూకం వెంటనే ప్రారంభించాలి

- అడిషనల్ కలెక్టర్‌కు టీజేఎస్ నాయకుల వినతి

నవతెలంగాణ-కామారెడ్డి

రైతుల వద్ద కొనుగోలు కేంద్రాలలో తూకం వెంటనే ప్రారంభించాలని టీజేఎస్ నాయకులు కామారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్‌కు శనివారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా టీజేఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిజ్జన రమేష్ మాట్లాడుతూ.. రైతుల వడ్లు కల్లాలకు తెచ్చి 25 రోజులు గడుస్తుందని, కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా.. తూకం మాత్రం ప్రారంభించలేదన్నారు. ప్రైవేట్ వ్యక్తుల దగ్గర తెచ్చిన అప్పులు కట్టడానికి రైతులు దళారులకు పంటను అమ్ముకొని నష్టపోతున్నారని తెలిపారు. వర్షాలు పడుతున్నాయని, నెలల తరబడి కష్టం చేసినా పంట వృథా అవుతుందని, రైతులకు తీవ్ర నష్టం వచ్చే అవకాశం ఉందన్నారు. కల్లాల్లో రైతులకు ఇబ్బందులు రాకుండా టార్పాలిన్లు అందించాలని, హమాలీలకు ఇచ్చే కూలీ ప్రభుత్వమే భరించాలన్నారు. కల్లాలో రైతులకు ఇబ్బందులు రాకుండా మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కుంబాల లక్ష్మణ్ యాదవ్, ప్రధాన కార్యదర్శి జెడల రజిని కాంత్, జిల్లా నాయకులు నీల నాగరాజు, పుల్లూరి పోచయ్య పాల్గొన్నారు.



వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

గాంధీనగర్‌లో వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామ శివారులో గల గాంధీ నగర్‌లో పోలీసులు శనివారం వాహనాలను తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపిన వారికి జరిమానాలు విధించినట్టు ఎస్ఐ తిరుపతి తెలిపారు. హెల్మెట్ లేకుండా వాహనం నడిపిన వారికి, లైసెన్సు లేని వారికి, నిబంధనలకు విరుద్ధంగా నడిపిన 20 మంది వాహనదారులకు ఆన్‌లైన్‌లో జరిమానా విధించినట్టు ఎస్ఐ తెలిపారు.

రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు పల్లికొండ విద్యార్థులు

నవతెలంగాణ-భీంగల్ రూరల్


ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఉమ్మడి జిల్లా హాకీ అండర్-17 బాలబాలికల (ఎస్‌జీఎఫ్) విభాగంలో భీంగల్ మండలంలోని పల్లికొండ గ్రామానికి చెందిన గౌతమ్ రాణా, తనూజ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల అధ్యాపకులు తెలిపారు. ఈ నెల 5, 6, 7 తేదీలలో సంగారెడ్డిలో జరిగే రాష్ట్ర స్థాయి హాకీ క్రీడాలలో గౌతమ్ రాణా పాల్గొంటారని ఫిజికల్ డైరెక్టర్ చిన్నయ్య తెలిపారు. స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనురాధ, ఉపాధ్యాయ బృందం గౌతమ్ రాణాను, తనూజను అభినందించారు.

గ్రామసభలో ఉపాధి పనుల గుర్తింపు

నవతెలంగాణ-రెంజల్


గ్రామసభలో మాట్లాడుతున్న పలువురు

రెంజల్ మండలం బాగేపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో ఉపాధి హామీ పనులపై శనివారం గ్రామ సభను నిర్వహించినట్లు గ్రామ ప్రత్యేక అధికారి హెచ్. శ్రీనివాస్ తెలిపారు. 2025-2026 ఆర్థిక సంవత్సరం ఉపాధి కూలీలకు పని కల్పించడానికి పనులను గుర్తించినట్టు తెలిపారు. చెరువులో పూడిక పనులు తప్ప, ఫార్మేషన్ రోడ్లు, నర్సరీల లోని మొక్కలు నాటడం, తదితర అంశాలపై నివేదికను తయారు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ రమణ, గ్రామ కార్యదర్శి జె .శ్రీకాంత్, క్షేత్ర సహాయకుడు గోపి, కారోబార్ మహేష్, అంగన్వాడి సరోజ, నాగయ్య, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

పోలీస్‌శాఖ నిబంధనలు పాటించాలి

- ఇన్‌చార్జి సీపీ సింధుశర్మ

నవతెలంగాణ-కంఠేశ్వర్


మాట్లాడుతున్న సింధుశర్మ

నిజామాబాద్ జిల్లా ప్రజలు పోలీస్ శాఖ నియమ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని నిజామాబాద్ ఇన్చార్జి పోలీస్ కమిషనర్ సింధు శర్మ సూచించారు. శనివారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా విగ్రహాలను ప్రతిష్ఠించరాదని, ముఖ్యంగా జనరద్దీగా ఉండే ప్రాంతాలు, పార్కులు, ఐలాండ్ ప్రభుత్వ భవనాలు లాంటి చోట్ల ఎటువంటి విగ్రహాలను ఏర్పాటు చేపట్టరాదని తెలిపారు. విగ్రహాల ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ అనుమతులు తప్పనిసరిగా పొందవలసి ఉంటుందని తెలిపారు. ఎక్కువ శబ్దంతో డి.జే లను ఏర్పాటు చేయరాదని, ఇలా చేయడం వల్ల దీర్ఘకాలికంగా అనారోగ్యంతో బాధపడే వృద్ధులు, చిన్న పిల్లలు మహిళలు ఇబ్బంది పడే అవకాశాలు ఉన్నందున ప్రజలు జాగ్రత్తలు పాటించాలని తెలియజేశారు. రెసిడెన్షియల్ స్థలంలో, కమర్షియల్ స్థలాల్లో రాత్రి సమయంలో 55 డెసిబెల్స్ సౌండ్‌కు మించి వాడొద్దని, రాత్రి 10 గంటల నుండి ఉదయం 6 గంటల వరకు డి.జే ల సౌండ్ సిస్టం పూర్తిగా నిషేదం ఉన్నట్టు తెలిపారు. పోలీసుల అనుమతి తప్పనిసరి తెలిపారు.

'ఊరేగింపులు, బహిరంగ సభల్లో పరిమితులకు మించిన ధ్వని శబ్దం ఉత్పత్తి చేసే డి.జేలు సౌండ్ సిస్టంలు నిజామాబాద్ కమీషనరేటు పరిధిలో నిషేదం. ఎవరైనా సభలు, సమావేశాలు జన సంచార ప్రదేశాల్లో లౌడ్ స్పీకర్లు పెట్టాలని భావిస్తే సంబంధిత అధికారుల నుండి ముందస్తుగా అనుమతి తీసుకోవాలి. 500 మందితో కూడిన సమావేశాలు లేదా సభలు నిర్వహించాలని భావిస్తే సంబంధిత అసిస్టెంటు పోలీస్ కమీషనర్(ఏసీపి) అనుమతి తప్పనిసరి. 500 మంది కంటే ఎక్కువ జనాలతో కూడిన కార్యక్రమనికి 72 గంటల ముందుగా పోలీస్ కమీషనర్ గారి అనుమతి తీసుకోవాలి. మాల్స్, సినిమా థియేటర్స్, హెూటల్స్, ఎగ్జిబిషన్, బిజినెస్ ప్రదేశాల వద్ద ప్రజల కోసం సెక్యూరిటి నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి.'

డ్రోన్ల వాడకం వలన ఎక్కువ ప్రమాదాలు పొంచి ఉన్న నేపథ్యంలో నియంత్రణ చర్యలు తీసుకుంటున్నాము. డ్రోన్ల ఉపయోగం వలన జన జీవనానికి విఘాతం కలగడమే కాకుండా శాంతి భద్రతలకి విఘాతం వాటిల్లే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, ఎవరయినా ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ప్రారంభించదలచినచో ముందస్తుగా సంబంధిత ప్రభుత్వ సంస్థలు, పోలీసు ఏవియేషన్ అధికారుల నుండి క్లియరెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలి. జిల్లాలో నకిలీ గల్ఫ్ ఏజెంట్లకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, పాస్పోర్టు, వీసా, రవాణా, టూరిస్ట్ తదితర సేవలు కల్పిస్తామని మాయమాటలు చెప్పి చాలా మంది గల్ఫ్ ఏజెంట్లు అనదికారికంగా వ్యాపారాలు నిర్వహిస్తూ అమాయక ప్రజలను మోసం చేస్తున్నారు. కావున జిల్లా ప్రజలు గల్ఫ్ ఏజెంట్లకు తమ ఇల్లు అద్దెకు ఇచ్చే ముందుజాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. అటువంటి వారు అద్దెకు వస్తే ముందస్తుగా వారి సమాచారాని సంబంధిత పోలీసు స్టేషన్ వారికి తెలియజేయండి. ఎవరైనా అనుమానస్పదంగా కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం' ఇవ్వాలన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు విద్యార్థిని ఎంపిక


విద్యార్థిని మనోజ్ఞను అభినందిస్తున్న హెచ్ఎం, పీడీ, ఉపాధ్యాయులు

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని పోలపల్లి మనోజ్ఞ రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ అండర్-14 ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల వ్యాయమ ఉపాధ్యాయులు రాజేశ్వర్ శనివారం తెలిపారు. నేటి నుంచి ఆరవ తేదీ వరకు కామారెడ్డి జిల్లాలోని పోసానిపేట్‌లో జరిగే పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థినిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీందర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేశ్వర్, మోహన్, శోభ, లింబాద్రి, రేణుక, గంగా మోహన్, లావణ్య, విట్టల్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం


సీసీరోడ్డు మరమ్మతు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట మండలంలోని పోల్కంపేట్ గ్రామంలో శనివారం సిసి రోడ్డు మరమ్మతు పనులను తాజా మాజీ సర్పంచ్ పద్మా నాగరాజు ప్రారంభించారు. పీహెచ్‌సి సెంటర్ ముందు గల రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో రోగులకు గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు దృష్టికి తీసుకెళ్లగా.. సానుకూలంగా స్పందించి మరమ్మతు పనులకు నిధులు మంజూరు చేయడంతో పనులు ప్రారంభించినట్టు తెలిపారు. కార్యక్రమం లో గ్రామ పంచాయతీ కార్యదర్శి అశ్వక్, మండల కో-ఆర్డినేషన్ సభ్యులు నాగరాజు గ్రామ కమిటీ అధ్యక్షులు అజయ్ గౌడ్, మండల బి. సి సెల్ ఉపాధ్యక్షులు శివయ్య, గ్రామ ఇందిరమ్మ కమిటీ సభ్యులు, యం.డి సాజీద్ ఖాన్,కేసరి అజయ్ గ్రామ కమిటీ ఉపాధ్యక్షులు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సతీష్, యూత్ ఉపాధ్యక్షులు సాయిబాబా తో పాటు గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బక్క నారాయణ, దాసరి శ్రీనివాస్, బండారి సంజీవరెడ్డి పాల్గొన్నారు.

దోమలను వృద్ధిచెందనివ్వొద్దు

- దోమల నివారణతో సీజన్‌ల వ్యాధుల కట్టడి

నవతెలంగాణ-డిచ్‌పల్లి


డ్రయినేజీల వద్ద దోమల మందు పిచికారీ చేయిస్తున్న వైద్యాధికారులు

దోమలు వృద్ధిచెందకుండా లార్వా దశలో నివారణకు చర్యలు చేపట్టాలని మండల ఆరోగ్య విస్తరణ అధికారి వైశంకర్ సూచించారు. లార్వా నివారణకు టి మో ఫాస్, దోమల నివారణ కొరకు పైరిత్రిం స్ప్రే చేపట్టాలని, గ్రామాల్లో డెంగ్యూ వ్యాధి నివారణ కోసం అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. శనివారం ఇందల్ వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో డిచ్‌పల్లి, ఇందల్‌వాయి మండలాల పరిధిలోని నక్కల గుట్టా, ఇందల్‌వాయిలో జాతీయ కీటక జనిత వ్యాధులైన మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా లాంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణ చర్యలు పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి చుట్టుపక్కల పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలని, పూల కుండీలలో పాత టైర్లలో కొబ్బరి చిప్పలలో తొలగించాలని తెలిపారు. నీరు నిలవ గల ప్రాంతాలలో గుర్తించి గ్రామ కార్యదర్శికి నివేదిక సమర్పించాలని ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. నీరు నిలువగల ప్రాంతాలలో ఆయిల్ బాల్స్ వదలాలని గ్రామ కార్యదర్శికి తెలియజేశారు. అలాగే మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, హాస్టల్లో జాతీయ కీటక జనిత వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు దేవపాల, ఆరోగ్య సిబ్బంది సాయి వీర కుమారి, రాధిక, శోభ, సుజాత, ఎం.ఎల్.హెచ్.పి డాక్టర్ సుజాత ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వృద్ధురాలికి గ్యాస్ పొయ్యి అందజేత


గ్యాస్‌పొయ్యి అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని రైల్వే కమాన్ వద్ద నివాసం ఉండే ఓ వృద్ధురాలికి రక్షిత ఫౌండేషన్ అండగా నిలిచి వృద్ధురాలికి గ్యాస్ పొయ్యి అందజేశారు. ఈ మేరకు శనివారం రైల్వే కమాన్ వద్ద నివాసం ఉండే బాలుడికి మతి స్థిమితం సరిగ్గా లేదని తల్లి, తండ్రి వదిలేయటం తో అన్ని తానై ఓ వృద్ధురాలు చూసుకుంటుంది. వృద్ధురాలినీ కలిసి ఏమైనా సహాయం కావాలా అని అక్షిత ఫౌండేషన్ సభ్యులు అడిగారు. వండుకోటానికి ఏమి లేవు ఒక గ్యాస్ పొయ్యి కావాలని చెప్పడంతో అక్షిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా గ్యాస్ పొయ్యి ఆ వృద్ధిరాలికి అందజేశారు. ఇంకా ఏమైనా అవసరం ఉంటే ఇప్పించేందుకు అండగా ఉంటామని వ్యవస్థాపక అధ్యక్షులు - అక్షిత ఫౌండేషన్ సన్నీ రాపాక తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పేదప్రజల కోసం అలుపెరగని పోరు.. డీవీకే

- డీవీకే విగ్రహావిష్కరణ పోస్టర్‌ల ఆవిష్కరణ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఈనెల 9న ఆర్మూర్ పట్టణ కేంద్రంలో కామ్రేడ్ దుర్గంపూడి వెంకట కృష్ణ (డీవీకే) విగ్రహావిష్కరణ, సభ గోడప్రతులను మండల కేంద్రంలో సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ ప్రజా పంథా కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ ప్రజాపంథా నిజామాబాద్ జిల్లా నాయకులు సారా సురేష్ మాట్లాడుతూ దాదాపు 53 సంవత్సరాలు పేద ప్రజల కోసం అలుపేరుగాని పోరాటం చేసిన నాయకుడు కామ్రేడ్ దుర్గంపూడి వెంకట కృష్ణ అని కొనియాడారు. భారత దేశంలో విప్లవం సిద్ధించాలంటే ప్రజాపంథా మార్గమే సరైన మార్గమని అనేక పుస్తకాలు రాసి విప్లవకారులం దరికీ ఆదర్శమూర్తిగా నిలిచిన గొప్ప వ్యక్తి కామ్రేడ్ డీవీ కృష్ణ అన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుకూలంగా విప్లవకారులందరు మారాలని పరిస్థితులకు భిన్నంగా ఉంటే విప్లవం తీసుకురాలేమని ఈ దేశంలో మార్పు రాదని గ్రహించిన వ్యక్తి కామ్రేడ్ డీవీకే అని పేర్కొన్నారు. విప్లవద్యం ముందుకు పోవాలంటే దుర్గంపూడి వెంకటకృష్ణ చూపిన మార్గమే సరైన మార్గమన్నారు.ఈనెల 9న ఆర్మూర్ పట్టణ కేంద్రంలో నిర్వహించనున్న దుర్గంపూడి వెంకట కృష్ణ విగ్రహావిష్కరణ సభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు.కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) ప్రజా పంథా మండల కార్యదర్శి బషీరి అశోక్, మండల నాయకులు వి. సత్తెమ్మ, ఉట్నూర్ అశోక్, టి.బాలకిషన్, ఎస్. గంగారాం, టి. బాలయ్య భూమన్న, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో కాకాని బ్రదర్స్ చేరిక


కాంగ్రెస్ కండువా కప్పుతున్న పార్టీ మండల అధ్యక్షులు

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండల కేంద్రంలో వ్యాపారవేత్తగా పేరుగాంచిన కాకాని బ్రదర్స్ శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. సలాబత్‌పూర్ ఆలయ కమిటీ మాజీ చైర్మన్‌గా పని చేసిన గోవింద్ కాకానీతో పాటు తమ్ముడు కైలాస్‌కు పార్టీ మండల అధ్యక్షులు హనుమాన్లు స్వామి కండువాలు వేసి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి పనులు జుక్కల్ నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావు చేస్తున్న కృషికి పార్టీలో చేరినట్టు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మండల మాజీ జెడ్పిటిసి జి సాహెబ్ రావు, యువ నాయకులు రామ్ పటేల్, మాజీ సర్పంచ్ విట్టల్ గురూజీ, వట్నాల రమేష్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు జావిద్ పటేల్, సింగిల్ విండో డైరెక్టర్ ఖైదల్ రాజు, తదితరులు పాల్గొన్నారు

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-కంఠేశ్వర్



గుర్తుతెలియని రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐ సాయి రెడ్డి శనివారం తెలిపారు. రైల్వే ఎస్సై సాయి రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం తెల్లవారుజామున నాలుగు గంటలకు నిజామాబాద్ స్టేషన్ మేనేజర్ రమేశ్ ఇచ్చిన సమాచారం ప్రకారం మోస్రా గ్రామానికి చెందిన సోమ నర్సయ్య (42) ఆర్సపల్లి రైల్వే గేట్ దగ్గరలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. పెరాలసిస్‌తో బాధపడుతున్నాడు. నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో చెకప్ చేయించుంటున్నారు. ఈ క్రమంలో తీవ్ర మనస్థాపానికి గురై రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు. అంతకుముందు స్టేషన్ మాస్టర్ రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు విచారణ చేపట్టినట్టు తెలిపారు.

మత్స్యకారులకు ప్రభుత్వం చేయూత

- చేప పిల్లల విడుదలలో అగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజ్

నవతెలంగాణ-బాన్సువాడ (నసురుల్లాబాద్)


చేప పిల్లలను చెరువులో వదులుతున్న బాలరాజ్

కులవృత్తిపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులకు ఆర్థిక చేయూత నివ్వాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తుందని రాష్ట్ర ఆగ్రోస్ సమస్తా చైర్మన్ కాసుల బాలరాజ్ తెలిపారు. శనివారం బాన్సువాడ మండలంలోని తాడ్కోల్ , తిర్మాలపూర్ గ్రామ చెరువులో ప్రభుత్వం సబ్సిడీతో అందజేస్తున్న చేప పిల్లలను వదిలారు. ఇందులో తాడ్కోల్ గ్రామ ఊర చెరువుకు 58 వేలు, తిర్మాలపూర్ గ్రామంలో ఉన్న రెండు ఊర చెరువుకు 45 వేల చేప పిల్లల విత్తనాలను నేడు పంపిణీ చేసి చెరువులో వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తుందని అన్నారు. సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. అలాగే మత్స్య శాఖ అధికారి డోల్ సింగ్ మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్ధి కోసం బాన్సువాడ నియోజకవర్గంలోని బాన్సువాడ, తిర్మలాపూర్ తడకొల్ గ్రామాలకు ఉచిత చేప పిల్లల పంపిణీ పంపిణీ చేయడం జరిగిందని అలాగే పంపిణీ చేయడం జరిగిందని అలాగే బాన్సువాడ ఊర చెరువుకు 75 వేల చేప పిల్లల పంపిణీ కార్యక్రమం ఉందని త్వరలో పంపిణీ చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా మైనారిటీ అధ్యక్షులు ఖలేక్, మాజీ జడ్పిటిసి గోపాల్ రెడ్డి, విండో అధ్యక్షులు గంగుల గంగారం, బాన్సువాడ నియోజక వర్గ యువజన విభాగం అధ్యక్షులు మధు సూధన్ రెడ్డి, హన్మాండ్లు, మాజీ సర్పంచ్ రాజు, రామ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, బోయ సంగం పాల్గొన్నారు.

భారతీయ చట్టాలపై పోలీసులకు అవగాహన


అవగాహన కల్పిస్తున్న పబ్లిక్‌ప్రాసిక్యూటర్‌లు

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ జీ. వైజయంతి నిజామాబాద్, కామారెడ్డి ఉమ్మడి జిల్లాల డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ పి.లక్ష్మీనర్సయ్య ఆదేశాల మేరకు శనివారం జిల్లా న్యాయస్థానముల సముదాయంలో కొత్త న్యాయ చట్టాలు భారతీయ న్యాయ సన్హిత్ 2023, భారతీయ నాగరిక్ సురక్షా సన్హెత్ 2023, భారతీయ సాక్ష అధినియం 2023 లపై నిజామాబాద్ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ యం.డి. రహిమొద్దిన్, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ పి. లక్ష్మీనర్సయ్య లు క్లుప్తంగా అవగాహణ కల్పించారు. నేర పరిశోధనలో పోలీసు వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నూతన చట్టాలను అవలంభించి నేరస్తులకు శిక్షపడేటట్లు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు వారి యొక్క పరిధిలోని పోలీసు వారికి సలహాలు ఇవ్వాలని డిప్యూటి డైరెక్టర్ లక్ష్మీనర్సయ్య కోరారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మీనర్సయ్య, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పీసు రాజేశ్వర్, బంటు వసంత్, రాజారెడ్డి, నిజామాబాద్ డివిజన్లోని పోలీసు అధికారులు, పోలీస్ ఇన్స్పెక్టర్లు కోర్టు ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

బియ్యం సక్రమంగా పంపిణీ చేయాలి

- రేషన్ షాపును ప్రారంభించిన ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ

నవతెలంగాణ-భిక్కనూర్


రేషన్‌షాప్‌ను ప్రారంభిస్తున్న షబ్బీర్‌అలీ

మండల కేంద్రంలో శనివారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ నూతన రేషన్ షాపును ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలంలో ఇటీవల ఖాళీగా ఉన్న రేషన్ షాపుల కొరకు పరీక్షల ద్వారా ఎంపికైన నిరుద్యోగులను మెరిట్ పద్ధతిన ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వారికి రేషన్ షాప్‌లు కేటాయిస్తూ సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. మండల కేంద్రానికి చెందిన శ్రీనివాస్‌కు కేటాయించిన రేషన్ షాపును ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు బియ్యాన్ని సక్రమంగా అందించాలని, సమయపాలన పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భీమ్ రెడ్డి, ఏఎంసి చైర్మన్ రాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుదర్శన్, పట్టణ అధ్యక్షులు దయాకర్ రెడ్డి, ఎమ్మార్వో శివ ప్రసాద్, ఎంపీడీవో రాజ్ కిరణ్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం


వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న శంకర్

నవతెలంగాణ-పోతంగల్

మండల కేంద్రంలో బాన్సువాడ నియోజకవర్గం పిఎస్ఆర్ - కెబిఆర్ వాలీబాల్ టోర్నమెంట్‌ను శనివారం పుప్పాల శంకర్ ప్రారంభించారు. ఫైనల్ మ్యాచ్ ఆదివారం, సాయంత్రం 6 గంటలకు నిర్వహించనున్నట్టు తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి గా 11,111 రూపాయలు, రెండవ బహుమతి గా 5,555 రూపాయలు అందజేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి గంధపు పవన్, ఎఎంసి చైర్మన్ గైక్వాడ్ హన్మంతు, శాంతేశ్వర్ పటేల్, మాజీ ఎంపిటిసి కేశ వీరేశం, బాన్సువాడ నియోజకవర్గ కార్యదర్శి గంధపు రాజు, నిజామాబాద్ జిల్లా సేవాదల్ మెంబర్ భజరంగ్ దత్తు, విఠల్, మాణిక్ అప్ప, మండల యూత్ అధ్యక్షులు మన్సూర్, వివిధ అనుభంద సంస్థల అధ్యక్షులు, మండలంలోని అన్ని గ్రామాల అధ్యక్షులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.